# హౌసింగ్‌బోర్డ్ ఫర్ సేల్!

- భూములు, దుకాణాలు అమ్మేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు
- సచివాలయానికి చేరిన దస్త్రం
- లబోదిబోమంటున్న ఉద్యోగులు




హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): ఆదాయ సముపార్జనే లక్ష్యంగా హౌసింగ్‌బోర్డు ఆస్తులను విక్రయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. సుమారు 600 ఎకరాల భూమి, 300 దుకాణాలను విక్రయించాలని నిర్ణయించింది. మంత్రి ఆదేశాలతో దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధంచేసిన అధికారులు, పూర్తి వివరాలతో సచివాలయానికి నివేదిక పంపారు. పేద, మధ్య తరగతివర్గాల కోసం హౌసింగ్ కాలనీలు అభివృద్ధిచేసి సరసమైన ధరలకు విక్రయించే ఉద్దేశంతో దశాబ్దాల క్రితమే హౌసింగ్‌బోర్డుకు అంకురార్పణ జరిగింది. కేపీహెచ్‌బీ, అమీర్‌పేట్, ఈసీఐఎల్ తదితర అనేక ప్రాంతాల్లో హౌసింగ్‌బోర్డు కాలనీలు ఏర్పాటయ్యాయి. కాలక్రమంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో పేదలకోసం ఉచితంగా అందించే గృహాల నిర్మాణం కోసం హౌసింగ్ కార్పొరేషన్, మధ్యతరగతి వర్గాల కోసం గృహకల్పను కూడా ఏర్పాటుచేశారు. దీంతో హౌసింగ్ బోర్డు ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. హౌసింగ్ బోర్డుకు సంబంధించి హైదరాబాద్‌తోపాటు దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో 4,609 ఎకరాల స్థలం ఉండగా, అందులో 3,820 ఎకరాల్లో ఇదివరకే కాలనీల నిర్మాణం జరిగింది. మిగిలిన 789 ఎకరాల్లో దాదాపు 80 ఎకరాలపై కోర్టులో కేసులున్నాయి. 610 ఎకరాలు క్లియర్‌గా ఉన్నది. దీన్ని విక్రయించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. ఇవికాకుండా 150 ఎకరాల భూమి లీజులకు ఇచ్చారు. ఇందులో సుమారు 100 ఎకరాలు జేఎన్టీయూకు ఇవ్వగా, మిగిలింది వివిధ సంస్థలు, వ్యక్తులకు ఇచ్చారు. ఇందులో కొన్ని భూములపై కోర్టులో వివాదాలు కొనసాగుతున్నాయి. హౌసింగ్‌బోర్డుకు సంబంధించి నగరంలోని ఎంజే రోడ్, మహబూబ్‌గంజ్, బషీర్‌పల్లి, విజ్ఞాన్‌పురి, వెంగళరావునగర్, బర్కత్‌పుర తదితర ప్రాంతాల్లో 300 దుకాణాలు ఉండగా, అనేక ఏండ్లుగా అద్దెల సవరణ జరగకపోవడంతో వాటిపై నామమాత్రంగా ఆదాయం వస్తున్నది. దీంతో ఉమ్మడి రాష్ట్రంలో 2005లో అప్పటి ప్రభుత్వం ఈ దుకాణాలను విక్రయ ఉత్తర్వులు జారీచేసింది. అప్పటి మార్కెట్ విలువ ప్రకారం 11 దుకాణాలను విక్రయించగా, వివిధ కారణాలతో మిగిలిన దుకాణాల విక్రయం నిలిచిపోయింది.

### భూముల ధరలు పెరగడంతో విక్రయానికే మొగ్గు

నగరంలో భూముల ధరలు అమాంతం పెరిగిపోవడంతో హౌసింగ్‌బోర్డు ఇప్పుడు కాలనీలు నిర్మించినా వాటి ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండే అవకాశం లేదు. కాలనీలు నిర్మించి రాయితీపై విక్రయించాలనుకున్నా.. లబ్ధిదారుల ఎంపికలో అనేక సమస్యలు ఎదురవుతాయి. రాష్ట్ర ప్రభుత్వం సైతం పేదల కోసం ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని సంకల్పించి దీనికోసం ఐదు లక్షల ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. ప్రభుత్వం నిధుల రాబడి కోసం ప్రభుత్వ ఆస్తులు, భూములనే నమ్ముకున్నది. ప్రైవేటు రియల్‌ఎస్టేట్ సంస్థలు ఆయా వర్గాల బడ్జెట్, అవసరాలకు అనుగుణంగా భారీగా ఇండ్లను నిర్మిస్తూ విక్రయిస్తున్నాయి. దీంతో హౌసింగ్ బోర్డుతో పనిలేకుండా పోయింది. ఈ క్రమంలో హౌసింగ్ బోర్డుకు ఉన్న భూములు, దుకాణాలను విక్రయించాలని తాజాగా ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ఇప్పటికే అధికారుల నుంచి భూములు, దుకాణాల వివరాలతోకూడిన నివేదిక తీసుకున్నది. త్వరలోనే వీటి విక్రయ ప్రక్రియ మొదలవుతుందని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

### హౌసింగ్‌బోర్డు ఉనికి ప్రశ్నార్థకం

హౌసింగ్‌బోర్డు భూములు, దుకాణాల విక్రయ నిర్ణయంపై ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొంతకాలంగా హౌసింగ్‌బోర్డులో కొత్త నియామకాలు లేకపోవడం, ఉన్నవారు ప్రతినెలా ఉద్యోగ విరమణ చేస్తుండటంతో ప్రస్తుతం హౌసింగ్‌బోర్డులో 45 మంది ఉద్యోగులు మాత్రమే మిగిలారు. ఇందులో 13 మంది వచ్చే నెలలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. వచ్చే నాలుగైదేండ్లలో మిగతావారూ విరమణ చేయనున్నారు. భూములు, దుకాణాలను విక్రయించి మిగిలిన ఉద్యోగులను ఇతర విభాగాల్లో సర్దుబాటు చెయ్యాలని ప్రభుత్వం భావిస్తున్నదని ఉద్యోగులు చెప్తున్నారు. అదే జరిగితే హౌసింగ్‌బోర్డు ఇక చరిత్రలో కలిసిపోతుందని అంటున్నారు.

### వేతనాలకే సరిపోతున్న అద్దెలు

హౌసింగ్‌బోర్డుకు సంబంధించి గృహకల్ప, గగన్‌విహార్, చంద్రవిహార్, ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఆఫీసు, మనోరంజన్ కాంప్లెక్స్, తుల్జాగూడ కాంప్లెక్స్, ఎస్‌ఆర్ నగర్ కాంప్లెక్స్ తదితర భారీ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. వీటిని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలకు అద్దెకు ఇచ్చారు. వీటిపై ప్రస్తుతం నెలకు రూ.3 కోట్లవరకు అద్దెలు వస్తుండగా, అవి ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోతున్నాయి. ఇందులో ఎక్కువశాతం ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు ఉండటంతో క్రమం తప్పకుండా అద్దెలు వస్తుండటంతో ఉద్యోగుల జీతభత్యాలకు లోటు లేకుండా ఉన్నది. అయితే, ఇందులోనూ కొందరు దుకాణదారులు కోర్టులో లిటిగేషన్లు వేసి అద్దెలు ఇవ్వడంలేదని ఉద్యోగులు చెప్తున్నారు.

## ‘11 నుంచి యాదగిరి గుట్టపైకి ఆటోలు’

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 6 : యాదగిరిగుట్ట కొండపైకి ఈ నెల 11 నుంచి ఆటోలకు అనుమతినిస్తున్నట్టు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. 10 రోజులపాటు పరిశీలించి విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. యాదగిరిగుట్టపై కలెక్టర్ హన్మంతు జెండగే, డీసీపీ రాజేశ్ చంద్ర, ఈవో రామకృష్ణారావు, మంగళవారం ఆయన సమీక్ష జరిపారు.

## ‘వేములవాడలో వీఐపీ బ్రేక్ దర్శనం’

వేములవాడ, ఫిబ్రవరి 6: తిరుమల తరహాలో వేములవాడ రాజన్న సన్నిధిలోనూ వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో కలెక్టర్ అనురాగ్ జయంతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

## ఆన్‌లైన్‌లో శ్రీవారి బ్రేక్ దర్శనాల టికెట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనానికి కేటాయించే టికెట్లను భక్తులు ఇకపై ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేసేలా టీటీడీ చర్యలు తీసుకొన్నది. సిఫారసు లేఖలిచ్చిన భక్తుల మొబైల్‌కు ఓ లింక్‌తో కూడిన మెసేజ్‌ను పంపుతున్నారు. భక్తులు ఆ లింకు క్లిక్ చేస్తే పేమెంట్ ఆప్షన్ వస్తుంది. ఆన్‌లైన్‌లో నగదు చెల్లిస్తే టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



ఆగపల్లి సమీపంలో జోరుగా కొనసాగుతున్న రోడ్డు పనులు

## ఈ రోడ్డు సీఎం కోసమా!

- ముమ్మరంగా రహదారి పనులు
- రాత్రికి రాత్రే పనులు ప్రారంభించిన అధికారులు
- ఆగపల్లి నుంచి సిరి నేచర్ రిసార్టు వరకు నిర్మాణం

మంచాల/అచ్చంపేట, ఫిబ్రవరి 6: రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆగపల్లి నుంచి కాగజ్‌ఘట్ వరకు చేపట్టిన బీటీ రోడ్డు విస్తరణ పనులను ప్రభుత్వం ఆగమేఘాల మీద కొనసాగిస్తున్నది. సోమవారం రాత్రికి రాత్రే.. అధికారులు పనులను ప్రారంభించారు. ఇదంతా.. సీఎం రేవంత్‌రెడ్డి రాక కోసమే చేస్తున్నట్టు స్పష్టమవుతున్నది. వాస్తవానికి ఆరు నెలల క్రితమే ఈ రోడ్డు విస్తరణ కోసం అప్పటి సీఎం కేసీఆర్ రూ.2 కోట్లు 75 లక్షల నిధులు మంజూరు చేశారు. నాలుగు నెలలపాటు రోడ్డును తొవ్వారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి.. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన పనులను నిలిపేసింది. నిత్యం దుమ్ము, దూళితో వాహనదారులు, గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోలేదు. రోడ్డును బాగుచేయాలనే ఆలోచన ఏ ఒక్క అధికారికీ రాలేదు. కానీ.. కాగజ్‌ఘట్ సమీపంలోని సిరి నేచర్స్ రిసార్టులో బీహార్ రాష్ర్టానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు తెలంగాణ ప్రభుత్వం భారీ బందోబస్తుతో ఆశ్రయం కల్పించిన నేపథ్యంలో.. వారిని కలుసుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 9న వస్తుండటంతో ఈ రోడ్డు పనులను రాత్రి, పగలు తేడా లేకుండా చేస్తున్నారని విమర్శలొస్తున్నాయి. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను గాలికి వదిలిన అధికారులు.. రోడ్డు పనులు ఎంత త్వరగా పూర్తి చేస్తే అంత మంచిదని కాంట్రాక్టర్లకు చెప్పడంతో.. వారు ఇష్టాను సారంగా పనులు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### శ్రీశైల క్షేత్రానికి బీహార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

బీహార్ రాష్ర్టానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు మంగళవారం శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లారు. భ్రమరాంబ, మల్లికార్జున స్వామి దర్శనానికి వెళ్తున్న ఎమ్మెల్యేల బృందానికి అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అమ్రాబాద్ మండలం మన్ననూర్ వనమాలిక గెస్ట్‌హౌజ్‌లో పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. నల్లమల అటవీ ప్రాంతం, శ్రీశైలం ఆలయం గురించి వారికి వివరించారు.

## 21న ఎప్‌సెట్ నోటిఫికేషన్

మొదటిపేజీ తరువాయి...

కో-కన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి విడుదల చేశారు. ఎప్‌సెట్‌ను ఇంటర్‌లో 100 శాతం సిలబస్‌కు నిర్వహిస్తామని డీన్‌కుమార్ వెల్లడించారు. నిరుడు ఫస్టియర్‌లో 70 శాతం, సెకండియర్‌లో 100 శాతం సిలబస్‌కు నిర్వహించగా, ఈ ఏడాది పూర్తిసిలబస్‌కు పరీక్ష నిర్వహిస్తారు. ఈ ఏడాది ఎప్‌సెట్ నిర్వహణ బాధ్యతలను జేఎన్టీయూకు అప్పగించిన విషయం తెలిసిందే. సమావేశంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్ లింబాద్రి, వైస్‌చైర్మన్ ఎస్కే మహమూద్, జేఎన్టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ డాక్టర్ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

**టీఎస్ ఎప్‌సెట్ (ఎంసెట్) షెడ్యూల్**

| | |
|---|---|
| నోటిఫికేషన్ విడుదల | 21-02-24 |
| దరఖాస్తుల స్వీకరణ | 26-02-24 |
| దరఖాస్తులకు తుది గడువు | 06-04-24 |
| పరీక్షలు | 09-05-24 నుంచి 12-05-24 వరకు |

## పల్లెప్రగతి చాలా బాగుండేది..

- కేసీఆర్ హయాంలో మారిన గ్రామాల రూపురేఖలు
- కొనియాడిన మహారాష్ట్ర బృందం



రాజోళి మండలం మాన్‌దొడ్డిలో పాఠశాలను సందర్శించిన మహారాష్ట్ర బృందం

రాజోళి, ఫిబ్రవరి 6 : కేసీఆర్ సర్కారు చేపట్టిన పల్లెప్రగతితో గ్రామాల రూపురేఖలు మారాయని, ఆ పథకం చాలా బాగుండేదని మహారాష్ట్ర అధికారుల బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. కేసీఆర్ హయాంలో జాతీయ స్థాయి అవార్డు అందుకున్న జోగులాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం మాన్‌దొడ్డి గ్రామాన్ని మంగళవారం మహారాష్ట్రకు చెందిన 30 మంది అధికారుల బృందం సందర్శించింది. ఎవెన్యూ ప్లాంటేషన్, పల్లెప్రగతి, ‘మన ఊరు-మన బడి’ వంటి పథకాలతో జరిగిన అభివృద్ధిని పరిశీలించారు. పల్లెప్రగతి, ఈజీఎస్ నిధులతో రహదారుల నిర్మాణాలు, పాఠశాలలకు మరమ్మతులు, కొత్త గదుల నిర్మాణం వంటి వాటిపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం నిర్వహించిన పనులపై మహారాష్ట్ర ఎంపీడీవోలకు, సర్పంచులకు మహారాష్ట్ర డిప్యూటీ సీఈవో అవగాహన కల్పించారు.

## అప్పుడే 36 డిగ్రీల ఎండ!

- ఈ నెలారంభంలోనే ఎండప్రతాపం
- రెండురోజుల్లో ఉష్ణోగ్రతల్లో మరింత పెరుగుదల
- చలికాలం ఇంకా ముగియలే.. మాడపగిలేలా ఎండలే
- హైదరాబాద్ వాతావరణ శాఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అప్పుడే భానుడు భగ్గుమంటున్నాడు. శీతాకాలం సీజన్ పూర్తిగా ముగియకముందే సూర్యుడు తారెత్తిస్తున్నాడు. హైదరాబాద్‌లో మాడ చుర్రుమనేలా ప్రతాపం చూపుతున్నాడు. నగరంలోమంగళవారం 36.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీఎస్‌డీపీఎస్) గణాంకాల ప్రకారం.. కాప్రా, సరూర్‌నగర్, చార్మినార్, రాజేంద్రనగర్, మెహదీపట్నం, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్‌తో సహా అనేక ఇతర ప్రాంతాల్లో 35 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిరుటితో పోలిస్తే కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో కూడా గణనీయమైన పెరుగుదల కనిపించింది. కనిష్ఠ ఉష్ణోగ్రత 16.5 డిగ్రీలు ఉండాల్సి ఉండగా..21 డిగ్రీ నమోదైంది. మారేడ్‌పల్లిలో 2023 ఫిబ్రవరి 6న 14.7 డిగ్రీలు ఉండగా, ఇప్పుడు 19.3 డిగ్రీలుగా రికార్డయింది. మంచిర్యాల జిల్లాలో గత ఏడాది 9.5 డిగ్రీలు ఉండగా.. ప్రస్తుతం 20.3, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 7.5 ఉండగా, ప్రస్తుతం 18.6, ఆదిలాబాద్ జిల్లాలో 8.0 ఉండగా ప్రస్తుతం 17.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు ఐఎండీహెచ్ అంచనా వేసింది. సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 35 డిగ్రీలకు చేరవచ్చని, గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా పెరిగే అవకాశం ఉంటుందని తెలిపింది.

**మంగళ వారం హైదరాబాద్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఇలా..**

| | | |
|---|---|---|
| హయత్‌నగర్ 36.3 డిగ్రీలు | కార్వాన్ 36.3 | బేగంపేట 36.3 |
| మెండామార్కెట్ 36.3 | మోహదీపట్నం 36.1 | సికింద్రాబాద్ 36.1 |
| శేరిలింగంపల్లి 36 | మూసాపేట 35.9 | కాప్రా 35.7 |

## మరో 60 గ్రూప్-1 పోస్టులు

- ఉద్యోగాల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి
- గతంలోనే 503 ఉద్యోగాలకు నోటిఫికేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో 60 గ్రూప్-1 ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించి నియామక ప్రక్రియ చేపట్టడానికి టీఎస్‌పీఎస్సీకి అనుమతి లభించింది. గతంలో కేసీఆర్ సర్కారు 503 గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టిన విషయం తెలిసిందే. 2022 ఏప్రిల్‌లో 503 పోస్టులకు టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, అదే ఏడాది అక్టోబర్‌లో ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షకు 3,80,081 అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 2,32,457 మంది పరీక్ష రాశారు. టీఎస్‌పీఎస్సీలో ప్రశ్న పత్రాల లీకేజీ నేపథ్యంలో ఆ పరీక్షను రద్దుచేసి మళ్లీ జూన్ 11వ తేదీన నిర్వహించింది. అప్పుడు బయోమెట్రిక్ పద్ధతిలో నిర్వహించలేదని కొందరు కోర్టును ఆశ్రయించగా ప్రిలిమ్స్‌ను మళ్లీ రద్దు చేయాలని హైకోర్టు తీర్పునిచ్చింది. దీంతో టీఎస్‌పీఎస్సీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఆ కేసు ప్రస్తుతం కోర్టులో పెండింగ్‌లో ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొత్తగా 60 ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టింది. గత నోటిఫికేషన్‌కు కొత్త ఉద్యోగాలను జత చేస్తే మొత్తం సంఖ్య 563కు చేరుతుంది. అయితే.. సుప్రీంకోర్టులో ఉన్న కేసును టీఎస్‌పీఎస్సీ ఉపసంహరించుకొని మొత్తం పోస్టులకు మళ్లీ నోటిఫికేషన్ ఇస్తుందా? లేక.. గత నోటిఫికేషన్ యథావిధిగా ఉంచి అనుబంధ నోటిఫికేషన్ ఇస్తుందా? అనే దానిపై చర్చలు జరుగుతున్నాయి. కొత్త పోస్టుల్లో అత్యధికంగా పోలీసుశాఖలో డీఎస్పీలు 24 ఉండగా, పంచాయతీరాజ్‌లో ఎంపీడీవో పోస్టులు 19 ఉన్నాయి. మిగతా ఏడు రకాల ఉద్యోగాలకు పోస్టుల సంఖ్య ఒకటి, రెండు, మూడు, నాలుగులోపే ఉన్నాయి. ఈ నెల 1వ తేదీన గ్రూప్ -1 నోటిఫికేషన్ ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో జాబ్‌గ్యారెంటీ అంటూ ప్రకటనలిచ్చిన విషయం తెలిసిందే. చెప్పిన సమయానికి నోటిఫికేషన్ ఇవ్వకపోవటంతో నిరుద్యోగులు ప్రభుత్వంపై ఆగ్రహంగా ఉన్నారు.

| విభాగం | క్యాడర్ | ఉద్యోగాల సంఖ్య |
|---|---|---|
| ఆర్థికశాఖ | అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ | 1 |
| హోంశాఖ | డీఎస్పీ | 24 |
| జైళ్లు | డీఎస్పీ | 3 |
| లేబర్, ఎంప్లాయిమెంట్ | డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ | 3 |
| పంచాయతీ రాజ్ | ఎంపీడీవో | 19 |
| పంచాయతీ రాజ్ | డీపీవో | 2 |
| రెవెన్యూ | డిప్యూటీ కలెక్టర్ | 3 |
| ఎక్సైజ్ | అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ | 4 |
| రిజిస్ట్రేషన్, స్టాంపులు | డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ | 1 |
| మొత్తం | | 60 |

## 2 లక్షల ఉద్యోగాలని.. 60 పోస్టులకు నోటిఫికేషనా?

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): ఈ ఏడాది చివరినాటికి 2 లక్షల కొత్త ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి.. కేవలం 60 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను వెంటనే గుర్తించి ఈ నెల చివరినాటికి మిగతా 1,99,940 ఉద్యోగాలకు షెడ్యూల్ విడుదల చేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేండ్లలో 1,60,083 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిందని, 42 వేల ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించిందని కోర్టు కేసుల కారణంగా నియామకాలు జరగలేదని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆస్తి బదలాయించుకున్న కోడలు.. రోడ్డునపడ్డ అత్త

- మంత్రి సీతక్క, పీఏ ఒత్తిడితో అధికారుల నిర్వాకం
- నిలువ నీడ లేకుండా చేశారని ఓ వృద్ధురాలి ఆవేదన
- చర్యలు తీసుకోవాలని హుస్నాబాద్ ఆర్డీవోకు వినతి



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట వృద్ధురాలు మల్లవ్వ

హుస్నాబాద్, ఫిబ్రవరి 6: బ్యాంకులో రుణం వస్తుందని తన ఇల్లు, ఇంటి స్థలం మొత్తాన్ని చిన్న కొడుకు పేరు మీద రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం గాంధీనగర్ పరిధి కిషన్‌నగర్‌కు చెందిన చాతబోయిన మల్లవ్వ(64) హుస్నాబాద్ ఆర్డీవో బెన్ షాలోమ్‌ను వేడుకున్నది. తన ఆస్తి తనకు అప్పగించాలని మంగళవారం ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చింది. వృద్ధురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ‘నాకుముగ్గురు కుమారులున్నారు. నా భర్త మరణించాడు. నా కుటుంబానికి కొన్ని అప్పులున్నాయి. వాటిని తీర్చేందుకు బ్యాంకులో రుణం కోసం.. మా కుటుంబం మొత్తానికి సంబంధించిన ఇల్లు, ఇంటి స్థలాన్ని అధికారులు నా చిన్న కొడుకు పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. దురదృష్టవశాత్తు రిజిస్ట్రేషన్ చేసిన నెల రోజులకే చిన్న కొడుకు కరోనాతో మృతి చెందాడు. ఇప్పుడు ఈ ఆస్తి మొత్తం నా భర్తకు చెందినదని చిన్న కోడలు అధికారులతో కలిసి ఇల్లు, ఇంటి స్థలాన్ని ఆక్రమించుకున్నది. దీంతో నా ఇద్దరు పెద్ద కొడుకులు, కోడండ్లు, వారి పిల్లలు రోడ్డున పడ్డారు. ఇదేంటని అధికారులను అడిగితే.. మంత్రి సీతక్కతో పాటు ఆమె పీఏ నుంచి ఒత్తిడి రావడంతోనే ఆస్తిని మార్పిడి చేసినట్టు అధికారులు చెప్పారు. రిజిస్ట్రేషన్ సమయంలో ముగ్గురు కొడుకులు రాసుకున్న ఒప్పంద పత్రం ఉందని చెప్పినా వినకుండా.. గాంధీనగర్ పంచాయతీ కార్యదర్శి ఇంటి నంబరును చిన్న కోడలి పేరుమీదకు మార్చాడు. ఉన్న ఆస్తిని కోల్పోయిన. నాకు గంజి ఎవరు పోస్తారు? అధికారులు, మంత్రి సీతక్క సమాధానం చెప్తుందా? నాకు న్యాయం చేయాలి’ అని మల్లవ్వ ఆర్డీవో ఎదుట గోడు వెల్లబోసుకున్నది.



ముంజంపల్లి పొలాల్లో స్పృహతప్పి పడిపోయిన గుడ్డెలుగును కర్రల సాయంతో మోసుకొస్తున్న అటవీ సిబ్బంది

## మానకొండూర్‌లో గుడ్డెలుగు హల్‌చల్

- మత్తు ఇంజెక్షన్ ఇచ్చి పట్టుకున్న అధికారులు

మానకొండూర్ రూరల్, ఫిబ్రవరి 6: ఓ గుడ్డెలుగు కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలో మంగళవారం హల్‌చల్ చేసింది. స్థానికులు, అటవీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున కరీంనగర్ - వరంగల్ జాతీయ రహదారి పక్కన మానకొండూర్ చెరువు కట్ట సమీపంలోని హనుమాన్ ఆలయం ముందు ఉన్న ఓ చెట్టుపైకి గుడ్డెలుగు ఎక్కింది. గమనించిన స్థానికులు ఆందోళన చెందారు. అప్పటికే వరంగల్ - కరీంనగర్ రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అయింది. వరంగల్ రెస్క్యూ టీం సభ్యులతోపాటు అటవీ అధికారులు, పోలీసులు మానకొండూర్‌కు చేరుకున్నారు. డాక్టర్లతో కలిసి గుడ్డెలుగుకు మత్తు మందు ఇచ్చేందుకు యత్నించారు. చెట్టు చుట్టూ వలను అమర్చారు. బెదిరిపోయిన గుడ్డెలుగు దగ్గరలోని చెరువు వైపు పారిపోగా, మళ్లీ ఎప్పుడు వస్తుందోనని స్థానికులు భయపడ్డారు. అటువైపు వెళ్లిన భల్లూకం కోసం అటవీ అధికారులు, సిబ్బంది ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. ఉదయం నుంచీ మధ్యాహ్నం దాకా వెతికారు. మానకొండూర్ - ముంజంపల్లి గ్రామ శివారుల్లోని పొలాల్లో గుర్తించి మత్తు ఇంజెక్షన్ ప్రయోగించారు. కొంత దూరం వెళ్లి కిందపడిపోగా, అధికారులు, సిబ్బంది పట్టుకొని ప్రత్యేక వాహనంలో వరంగల్‌లోని జూపార్కుకు తరలించడంతో సమీప గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## భార్యను మట్టుబెట్టిన భర్త

- కొడుకుతో కలిసి దారుణ హత్య
- ఆలస్యంగా వెలుగులోకి

రాయికోడ్, ఫిబ్రవరి 6: మతిస్థిమితం కోల్పోయి ఇంట్లో వాళ్లను ఇబ్బందులకు గురిచేస్తున్న ఓ వివాహితను భర్త, కొడుకుతో కలిసి హత్య చేశారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశం కథనం ప్రకారం.. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామానికి చెందిన దర్జీ మల్లేశ్వరి (42) మతిస్థిమితం కోల్పోయి ఐదేండ్లుగా బాధపడుతున్నది. తరచూ ఇంట్లో వాళ్లను ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఆమె ఇబ్బందులు భరించలేక భర్త, పెద్దకొడుకు కలిసి గతనెల 28న ఆమె పడుకున్న సమయంలో గొంతునులిమి చంపేశారు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా రాయికోడ్ మండలం సీరూర్ శివారులోని బ్రిడ్జి వద్ద మంజీరా నదిలో మృతదేహాన్ని పడేశారు. బంధువులకు, స్థానికులకు అనుమానం రాకుండా జనవరి 31న మల్లేశ్వరి తప్పిపోయిందని సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా సత్యనారాయణ, ప్రవీణ్‌ను అరెస్ట్ చేసి విచారణ చేపట్టగా ఘాతుకం బటయపడింది. పోలీసులు వారిని రిమాండ్‌కు తరలించారు.

## కానిస్టేబుల్ ఉద్యోగాలకు ‘సుప్రీం’ క్లియరెన్స్?

- నేడో, రేపో బోర్డు నుంచి అధికారిక ప్రకటన
- 12 నుంచి అపాయింట్‌మెంట్ ఆర్డర్స్?
- సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా అందజేత
- అన్ని విభాగాలకు రాష్ట్రహోంశాఖ ఆదేశాలు
- కేసీఆర్ ప్రభుత్వంలోనే 17,516 ఉద్యోగాలకు తుది ఫలితాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన 15,750 మంది అభ్యర్థులకు సుప్రీంకోర్టు నుంచి పెద్ద ఊరట లభించింది. తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్‌ఎల్‌పీఆర్బీ) సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌కు సానుకూలంగా తీర్పు వచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో నిరుడు అక్టోబర్ 4న ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాలనే ఫైనల్ చేస్తూ.. నేడో, రేపో టీఎస్‌ఎల్‌పీఆర్బీ తుది ప్రకటన చేయనున్నది. జరిగిన తప్పొప్పులపై హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవరిస్తూ.. నిపుణుల కమిటీ వేయాలన్న హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ టీఎస్‌ఎల్‌పీఆర్బీ అధికారులు ఇటీవల సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఈ నేపథ్యంలోనే బోర్డుకు అనుకూలంగా తీర్పు వచ్చినట్టు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో పోలీసు, జైళ్లు, ఫైర్, ట్రాన్స్‌పోర్టు, ఎక్సైజ్ శాఖల అధికారులకు టీఎస్‌ఎల్‌పీఆర్బీ నిరుడు అక్టోబర్ 4న ఇచ్చిన తుది ఫలితాలే ఫైనల్ అంటూ సమాచారం ఇచ్చినట్టు సమాచారం. ఆయా విభాగాల నియామక పత్రాలు తయారు చేసుకోవాలంటూ రాష్ట్రహోంశాఖ రహస్యంగా ఆదేశాలు ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. ఉన్నతాధికారులకు ఎంపికైన అభ్యర్థుల వివరాల లిస్టు, ఇతర లేఖలు వెళ్లాయి. డ్రైవర్, మెకానిక్ పోస్టులకూ లైన్‌క్లియర్ అయినట్టు సమాచారం.

### బోర్డు నుంచి సరైన వివరణ

సుప్రీంకోర్టులో వాదనల సందర్భంగా నోటిఫికేషన్ ఇచ్చిన దగ్గర్నుంచి.. తుది ఫలితా లు విడుదల వరకు అన్నింటినీ పద్ధతి ప్ర కారం నిర్వహించామని, సాంకేతికంగా కూ డా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకొన్నామని బోర్డు తరపు న్యాయవాది వివరించారు. దీంతో అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన సుప్రీంకోర్టు కూడా.. బోర్డు వాదనలకు ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. తెలంగాణ హైకోర్టు వేసిన నిపుణుల కమిటీ గడువు కూ డా ముగియనున్నది. దీంతో ఈ కమిటీ కూడా బోర్డు వాదనకే కట్టుబడి ఉన్నదని విశ్వసనీయంగా తెలిసింది.

### 12 నుంచి నియామక పత్రాలు?

ఈ నెల 12 నుంచి ఉద్యోగాలకు ఎంపికైన వారికి అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇవ్వనున్నట్టు విశ్వసనీయ సమాచారం. 12 నుంచే నియామకపత్రాలు ఇచ్చేలా ప్రింటింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని సీఎంవో, హోంశాఖ నుంచి ఆదేశాలు వెళ్లాయి. 12కు ముందు లేదా తర్వాత స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించనున్నారు.

### కేసీఆర్ హయాంలోనే తుది ఫలితాలు

అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 2022 ఏప్రిల్‌లో మొత్తం 17,516 పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చింది. వీటిల్లో 587 ఎస్సై, తత్సమాన ఉద్యోగాలకు, 16,604 కానిస్టేబుల్ తత్సమాన ఉద్యోగాలు ఉన్నాయి. 2022 ఏప్రిల్ నుంచి 587 ఎస్సై ఉద్యోగాలకు టీఎస్‌ఎల్‌పీఆర్బీ బోర్డు వివిధ దశల్లోపరీక్షలు నిర్వహించి, నిరుడు ఆగస్టులోనే తుది ఫలితాలను వెల్లడించింది. దీంతో ఎస్సై ఉద్యోగాలకు ఎంపికైన 587 మంది అభ్యర్థులు రాష్ట్ర పోలీసు అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. అభ్యర్థుల నియామక ప్రక్రియ 2022 ఏప్రిల్ నుంచి ప్రారంభమైంది. గర్భిణులైన అభ్యర్థినులతో మొదలైన చిన్న చిన్న వివాదాలు... తుది పరీక్షలో వచ్చిన ట్రాన్స్‌లేషన్ ప్రశ్నల వరకు చాలా సందర్భాల్లో అభ్యర్థులు హై కోర్టు మెట్లు ఎక్కారు. అయినా, టీఎస్‌ఎల్‌పీఆర్బీ ఎప్పటికప్పుడు హైకోర్టు సూచనలు పాటి స్తూ.. రిక్రూట్‌మెంట్ ప్రక్రియను కొనసాగించింది.

## భైంసాలో ‘డబుల్ ఇండ్ల’ లబ్ధిదారుల నిరసన



నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని బైపాస్ రోడ్డు సమీపంలో గల డబుల్ బెడ్రూమ్ ఇండ్ల వద్ద మంగళవారం లబ్ధిదారులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లక్కీ డ్రాలో తమ పేర్లు వచ్చాయని, తమకు డబుల్ బెడ్రూంలు కేటాయించాలని కోరారు. ఇప్పటికే కిరాయిలు కట్టుకుంటూ నివాసముంటున్నామని, అధికారులు వెంటనే స్పందించి డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించి పంపించారు. -భైంసా